# వేటగాడు

చందు సోంబాబు



నేను జూదగాడిని. నేను వేసే ప్రతి అడుగులోనూ అడుగువేస్తూ లక్ష్మీదేవి నడిచి నావెంట రావాలి. నేను డబ్బును ప్రేమిస్తాను. ఎక్కడ డబ్బును తేలిగ్గా సంపాదించవచ్చో అక్కడికి వెళ్ళటం నాకు అలవాటు.

నాకు రేసులన్నా, పేకటన్నా బోలెడంత సరదా.

నేను రేసుల్లోనూ, పేకాటలోనూ చాలా సంపాదించాను.

నేను ఇంజనీర్ని. ఇంకా పెళ్ళి, దానితోబాటుగా వచ్చే మెడకు బంధాలు లేకపోవటంచేత జల్సాగా జీవితం లాగించేస్తున్నాను.

రేసుకువెళ్ళినా, పేకాటలోకూర్చున్నా నేను చాలావరకు చాలా కమర్షియల్‌గా, ఆ అవుట్‌లుక్‌తోనే ఉంటాను. మరీ తీరిక సమయాల్లో స్నేహితులతో కలిసి మందు కొట్టడం, కాబరేలు చూడటం, మనసైతే మందు తర్వాత మదవతి పొందుకోరటం కూడా నాకు చాలా మామూలుగా అలవాటైన సంగతి.

మనసుకి నచ్చిన ఆడదాన్ని నా దారిలోకి ఎలా మళ్ళించుకోవాలో నాకు తెలుసు. కాసుకి లొంగని కాంత లేదని నా నమ్మకం. అందుకే డబ్బు అలా విసిరేసి వలలోకి ఆడదాన్ని లాగేందుకు నేను వెనుకాడను. అందమైన ఆడవాళ్ళను వేటాడి గెలవటంలోనూ, ఓడిపోవటంలోనూ ఎంత థ్రిల్ ఉందో నాకు బాగా తెలుసు.

నేను నగరంలో ఒంటరిగా ఉంటున్నాను. సొంతవూరు ఇందుపల్లి. ఆ ఊర్లో నాన్న వ్యవసాయం చేస్తాడు. అమ్మా, చెల్లాయి నాన్నతో అక్కడే ఉన్నారు. అంచేత నేను ఓ పోర్షన్‌లో అద్దెకు ఉంటున్నాను. నేనుండే పోర్షన్ కింద అన్నీ షాపులు. మేడ పైభాగంలో అన్నీ రెండు గదుల వాటాలు. అందులో ఓ పోర్షన్ నాది.

నా వాటాలోకి అడపాదడపా ఆడవాళ్ళు వస్తుంటారు. అద్దె ఎక్కువే ఐనా ప్రైవసీ ఉంటుందని భరిస్తున్నాను.

వయసులో ఉన్న ప్రతి మగవాడూ పెళ్ళికాకముందే కావల్సిన అందాన్నీ, ఆనందాన్నీ అనుభవించాలని నా అభిప్రాయం. పెళ్ళితో బాధ్యతలు పెరిగితే కట్టుకొన్న భార్యలో అందాన్నీ, ఆనందాన్నీ చవిచూడలేమోనని నా అనుమానం. అందుకే 'అనుభవించి తరించి సుఖించరా!' అన్న తత్వంలో ఉన్నాను.

చేతి వాచీ చూసుకొన్నాను. ఎనిమిదిన్నరయ్యింది.

అప్పటికి రెండు రౌండ్లు అయినాయి. లెవెల్స్‌లో ఉన్నాను.– ఆ మధ్యాహ్నమే రేసులో మూడువేలు కొట్టాను. అంచేత అక్కడి నుంచి బయటపడాలనే ఉద్దేశంతో కార్డ్స్ పడేసి లేచి నిలబడ్డాను.

"ఏం గురూ, అప్పుడే వెళ్ళిపోతున్నావే!" అడిగాడో మెంబర్.

"కాస్త అనీజీగా ఉంది. అయ్‌వాంట్టూ టేక్ రెస్ట్!" అన్నాను నవ్వుతూ.

"అదేం కాదు, గురుడు లెక్కల్లో దిట్ట. ఈ పూట అంతగా పలకడం లేదని తెలిసి చెక్కేస్తున్నాడు." అన్నాడు మరో మెంబరు.

నేను నవ్వి బయటికొచ్చాను. బయట చలిగాలి రివ్వుమని వీస్తోంది. రెండు పెగ్గులుకొట్టి గదికి పోతే సుఖంగా పడుకోవచ్చు. మందు కావాలంటే క్లబ్బులోనే కొట్టొచ్చు. కానీ అక్కడ మందు కొడితే, తిరిగి ఆటలోకి దిగే ప్రమాదం ఉంది. జేబులో– రేసులో గెల్చినవి, నావి మొత్తం అయిదువేల వరకూ ఉన్నాయి. ఉదయం ఆ డబ్బును బాంక్‌లో కట్టేయాలనుకొన్నాను.

స్కూటరెక్కి స్టార్ట్ చేశాను. సన్నగా చినుకులు పడుతున్నాయి. అలాటి వాతావరణం అంటే నాకు చాలా ఇష్టం. దార్లో బార్ దగ్గర స్కూటర్ ఆపి రెండు పెగ్గులు కొట్టాను.

తొమ్మిది దాటటంచేత రోడ్డుమీద అంతగా ట్రాఫిక్ లేదు. అంచేత స్కూటర్

జోరుగా పోతోంది. గాలి.... దానికితోడు సన్నని చినుకులు!

అంతలో బస్‌స్టాప్ షెల్టర్ పక్కనే నిలబడి ఉన్న ఓ అమ్మాయిపైన నా దృష్టి పడింది.

టెలిఫోన్ భవన్ లైట్ల వెలుగులో నా కళ్ళు జిగేలుమన్నాయి. స్కూటర్ ఆపాను. రోడ్డుమీదెవరూ లేరు. ఆ అమ్మాయిని నా కళ్ళు బాగా గమనించాయి. ఇదివరలో నాలుగైదుసార్లు ఆమెను అక్కడే చూశాను.

డ్యూటీ దిగి ఇంటికి పోవటానికి బస్ కోసం ఎదురుచూస్తూ నిలబడిన టెలిఫోన్ ఆపరేటర్ అయిఉంటుంది.

అక్కడెవరూ లేరు గనక నేను ఆమెను పలకరించటానికి భయపడాల్సిన అవసరం లేదు. ఒకవేళ తిట్టినా సిగ్గుపడాల్సిన పనిలేదు.

స్కూటర్ దిగి స్టాండువేసి ఒక్కసారి రోడ్డుకేసి చూశాను. అడపాదడపా వస్తున్న కారో, స్కూటరో, ఆటోయో తప్ప నరసంచారం లేదు. ఆదివారం కావటంచేత రోడ్డు మరింత ఖాళీగా ఉంది.

ఓసారి ఆకాశంకేసి చూశాను. ఆకాశం నల్లమబ్బులతో నిండిపోయి ఉంది. నేను ఆమెను పలకరించాలని ఓ అడుగు ముందుకువేశాను.

ఆమె నన్ను అదోలాచూసి పమిటను సర్దుకొని కొంచెం పక్కకు జరిగి నుంచుంది.

అంతలో ఓ బస్సువచ్చి ఆగింది. ఆ బస్ చిక్కడపల్లి పోతుంది. ఆమె ఎక్కలేదు. బస్ వెళ్ళిపోయింది. అంటే స్టేషన్ బస్ కోసమే ఆమె ఎదురుచూస్తోందని అర్థమయింది.

గాలి ఎక్కువగా ఉంది. ఒంటరిగా ఆమె అక్కడ నిలబడటం చూస్తే నాకు జాలి కలిగింది. బహుశా ఆమె పని చేస్తున్న ఆఫీసు పక్కనే ఉండటంచేత భయపడకుండా నిలబడి ఉండొచ్చు. అదీ కాక ఈ నైట్‌డ్యూటీలకి ఆమె అలవాటుపడి ఉండొచ్చు!

ఆమె అందమైనదని వేరే చెప్పక్కర్లేదు. ఆకర్షణీయంగా, చూడగానే ఆకట్టుకొనే ఆమె సౌందర్యం నన్ను ముగ్ధుణ్ణి చేస్తోంది.

తొందరపడకుండా ఆమెను నా దారిలోకి తిప్పుకోవాలి. ఈ అందాన్ని అనుభవించకపోతే నా మగపుట్టుకే వ్యర్థ మనిపిస్తోంది.

ఆమెకేసి చూశాను నేను. ఆమె బెదురుతున్న లేడిలా చూసింది. కనురెప్పలు కిందికి వాల్చేసింది.

"ఎక్కడికి వెళ్ళాలి?" అనడిగాను సౌమ్యంగా. ఆమె తలెత్తి చూసింది.

"మారేడ్‌పల్లి" అంది— ఎంత అందమైన గొంతు! ఆమె తియ్యని కంఠస్వరం నా గుండెలపైన పన్నీటిజల్లుని కురిపించింది.

"మీకు అభ్యంతరం లేకపోతే లిఫ్ట్ ఇస్తాను! రండి!" అన్నాను.

ఆమె నా మొహంలోకి ఓసారి చూసింది. ఆ తర్వాత రోడ్డుకేసిచూసింది.

"నేను అటే వెళ్తున్నాను. ఆకాశం చూడండి! కాస్సేపటిలో వానకూడా రావచ్చు. మీ కిష్టమైతేనే రండి. ఆడపిల్లలు ఇలా ఒంటరిగా బస్‌స్టాపుల్లో నిలబడటం, అదీ ఇలాటి సమయాల్లో మంచిది కాదు!" అన్నాను.

"థాంక్యూ!" అంది ఆమె ముందుకు వస్తూ. ఒక్కోసారి మనిషికి నటన ఎంతగా ఉపయోగపడుతుందో ఇప్పుడు తెలుస్తోంది నాకు.

మాటల్లో అవతలివాళ్ళను నమ్మించడం కూడా ఓ కళే! ఆమె అంత తేలిగ్గా నాతో వస్తుందని నేను నిజంగా ఊహించలేదు. మనసులో ఆనందం రెట్టింపు అవుతూ ఉంటే స్కూటర్‌ను స్టార్ట్ చేశాను. ఆమె వెనక ఎక్కి కూర్చుంది.

నిజంగా నేను జాతక పురుషుణ్ని. గత జన్మలో నేను చేసుకొన్న పుణ్యమే నా జీవితాన్నింతగా రంజింపజేస్తోందని అనుకోకుండా ఎలా ఉండగలను!

టాంక్‌బండ్ పైన వెళ్తుండగా అడిగాను, "మీరు ఆపరేటర్‌గా పనిచేస్తున్నారా?" అని.

"ఊ...."

"మీ పేరు?"

"కామిని" చెప్పింది.

"రియల్లీ? మీకు సరిపోయే పేరది!" అన్నాను.

కామిని గలగలా నవ్వింది.

"నా పేరు వెంకట్రామిరెడ్డి. అంతా 'రెడ్డి' అని పిలుస్తారు. ఉద్యోగరీత్యా ఇంజనీర్ని."

ఆమె ఆ మాటలు వింది. దారిలో ఏమిటేమిటో చెప్పి ఆమెను నవ్వించే ప్రయత్నాలు చేశాను. కామిని నన్నేమీ అడగలేదు. వైయంసిఏ దాటాక—

"ఇక్కడ ఆపండి."

స్కూటర్‌ను ఆపాను.

ఆమె దిగి "థాంక్స్" అంది.

"ఒట్టి థాంక్స్‌తోనే సరిపెట్టేస్తున్నారా?" అన్నాను.

నా మాటలకు ఆమె మనోహరంగా నవ్వింది. వాన చినుకులు ఆమె నవ్వు చూసేందుకు వచ్చినట్టుగా కొంచెం పెద్దవయినాయి.

"రేపు డ్యూటీ ఏమిటి?"


"ఇదే!"

"నేను మీకు లిఫ్ట్ ఇవ్వకపోతే పూర్తిగా ఈ వానలో తడిసిపోయేవారు. అంటే మీరు నాకు రుణపడిపోయారన్న మాట!"

"సిల్లీ" అంది కామిని నవ్వుతూ.

"వాన పెరిగేలా ఉంది. ఇంటివరకు డ్రాప్ చెయ్యనా?"

"నో, థాంక్స్. నాన్న ఊరుకోడు!" అని ఓసారి నాకేసి చూసి గబగబ పక్క




సందులోకి తిరిగి వెళ్ళిపోయింది కామిని. ఆమె వెళ్ళిపోయాక గుర్తొచ్చింది. ఆమె టెలిఫోన్ నంబర్ అడగకపోవటం నేనెంత పొరబాటు చేసిందీనూ!

మర్నాడు ఆమెను తిరిగి కలుసుకోవాలి. కామిని అందమైనదే కాదు, తెలివైందికూడాను! అయినాకూడా నా పట్ల ఆమెకు సదభిప్రాయమే కలిగిందన్నది సత్యదూరం కాని విషయం. ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు.

మర్నాడు పగలంతా చాలా బోర్‌గా గడిచింది. రాత్రి తొమ్మిది గంటలకే నాకు తెల్లవారేది! అప్పుడు కామిని బయటకు వస్తుంది. పగలు ఫోన్‌చేయాలనుకొన్నాను కానీ ఊరుకొన్నాను. ఆమెకోసం నేను తాపత్రయపడుతున్నట్లుగా ఆమెకి తెలీకూడదు.

అందుకే చీకటిపడేవరకూ చాలా ఓపికగా గడిపాను. రాత్రి ఎనిమిది గంటలకల్లా భోజనంచేసి తొమ్మిది అవుతుండగా టెలిఫోన్‌భవన్ బస్‌స్టాప్ దగ్గరకు వెళ్ళాను. బస్‌స్టాప్‌లో అక్కడక్కడా జనం ఉన్నారు. జనాన్ని చూస్తే నాకు చిరాకు కలిగింది.

కామిని షెల్టర్ పక్కగా నిలబడి ఉంది. నన్ను చూస్తూనే ఆమె నవ్వింది. "మీ రొస్తారని అనుకొన్నాను!" అంది.

"రానని ఎలా అనుకొన్నారు?" అని అన్నాను.

అక్కడ నిలబడ్డ కొందరు నాకేసి వింతగా చూస్తున్నారు. అందాలరాశి కామినితో నేను మాట్లాడటం చూసి జెలసీతో చస్తున్నారు వెధవలు, అనుకొన్నాను

"రండి, వెళదాం!"

నేను స్కూటర్ స్టార్ట్ చేస్తోంటే అక్కడెవడో అంటున్నాడు మెల్లిగా—"పాపం పిచ్చివాడు!" అని! ఆ మాటలు నాకు చాలా కోపాన్ని తెప్పించినప్పటికీ కామిని ముందు వాడితో గొడవపడటం నాకు ఇష్టంలేక స్కూటర్ని ముందుకు పోనిచ్చాను.

దారిలో అడిగాను— "ఏదైనా సినిమాకు వెడదామా?"

"మన పరిచయం నిన్ననే అయింది. అప్పుడే సినిమావరకొచ్చేశారు." అంది నవ్వుతూ.

"ఏం అడగకూడదా?"

"అలా అని అనలేదుగానీ.... ఇంటికి ఆ వేళలో చేరటం కష్టం!"

"నేను డ్రాప్‌చేస్తాను." అన్నాను.

కామిని ఏమీ అనలేదు. ఆమె మౌనమే నా గుండెల్లో కోటిదీపాలను వెలిగించాయి. కామిని నాకు అర్థమైంది చాలా! అంతకంటే ఇంకేం కావాలి!

థియేటర్‌లో స్కూటర్ పార్కుచేసి రెండు టిక్కెట్లు కొని గేటు దగ్గరికొచ్చాను. గేట్లో రెండు టిక్కెట్లు ఇచ్చి లోపలికి నడిస్తే, కూడా కామిని వచ్చింది నా వెనుకనే. —మేం నెంబర్లు చూసుకొని ఆ సీట్లలో కూర్చున్నాము.

సినిమా మొదలైంది.

"ఆయాం లక్కీ!" అన్నాను నేను కామినితో.

కామిని నవ్వింది— క్షణాల తర్వాత ఆమె చెయ్యి నా చేతిలో ఉంది. సున్నితంగా నాజూగ్గా ఆమె చేతిని నలుపుతున్నాను. ఆమె ఏమీ అభ్యంతరం పెట్టలేదు.

"కామినీ...."

"ఊఁ...."

"నువ్వెంత అందంగా ఉంటావో తెలుసా?—"

"నాకేం తెలుసు, మీరు చెప్పండి!"

నా మాటలకు వెనక నుంచి ఎవరో విసుక్కున్నారు. నాకు నవ్వొచ్చింది వాడి మాటలకు కాదు, వాడి జెలసీకి! అదే అంటే కామిని సిగ్గుతో నవ్వింది.

నేను కామిని భుజంవెనుకగా చేతిని పోనిచ్చి ఆమెను దగ్గరగా లాక్కుని ఆమె బుగ్గపైన ముద్దుపెట్టుకొన్నాను. "స్వీట్ కిస్" అన్నాను. నాకు చాలామంది ఆడవాళ్ళతో పరిచయం ఉంది. కాని కామిని అంత అందంగలదాన్ని నేను ఎక్కడా చూడలేదు. ముట్టుకోగానే నా నరాలు జివ్వుమంటున్నాయి. ఫోమ్ లాగా ఉంది ఆమె శరీరం. ఆడదంటే ఇలా ఉండాలనుకొన్నాను.

"సినిమా బోరుగా ఉంది. ఇంటికి పోదామా?" అన్నాను.

కామిని నవ్వింది—"అమ్మో, ఈవేళ వద్దు, రేపు...."

"రేపేమిటి ముహూర్తం?" అనడిగాను విసుగ్గా.

"ఈరోజు నాన్న ఊళ్ళోనే ఉన్నారు. రేపు ఊరెళుతున్నారు. అప్పుడయితే పర్వాలేదు?" అంది కామిని.

కామిని అందమైనది. అందమైనదే కాదు తెలివైనదీనూ! నాకు సరిజోడు—పక్కమీద తోడుగా ఉంటే ఇక స్వర్గాన్నే కిందికి దింపొచ్చు అనుకొన్నాను.

—మర్నాడు ఎప్పుడు చీకటి పడుతుందా, ఎపుడు స్వర్గసీమకు చేరుతానా అనే ఆలోచనలో ఉన్నాను. నా దురదృష్టంకొద్దీ ఆరోజు పగలుకు పన్నెండు గంటలు!!

మొత్తానికి చీకటిపడింది. నాకు, నా కోరికలకు తెల్లవారింది. ఇక పండుగే!


తొమ్మిదింటికి టెలిఫోన్ భవన్. తొమ్మిదింపావుకు హోటల్‌లో భోజనం, పదింటికి వీధిలో అందరూ నిద్రలోకి జారుకున్నాక, అపుడు కామినీ; నేనూ....

—తొమ్మిదికి సరిగ్గా టెలిఫోన్ భవన్‌కు చేరాను. షెల్టర్ దగ్గర కామిని! అందంగా ఉంది. నా కోసమే ఉంది.

వెళ్ళాను. స్కూటర్ ఎక్కబోతూ ఆగింది. "ఎటు వెడుతున్నాం మనం? అంటే మీ రూమ్ ఎక్కడ ఉంది?"

ఎందుకో తెలియకపోయినా అడ్రస్ చెప్పాను.

"అమ్మయ్య- అక్కడ అయితే నాకు ఎవరూ తెలిసినవాళ్లు లేరు!" అంది



కామిని. అపుడు అర్థం అయింది నాకు కామిని ఆ ప్రశ్న ఎందుకు వేసిందో.

"అవునూ, ఇంత తొందరగా వెళ్ళిపోతే....?—"

"లేదు, దారిలో ఆగి భోజనంచేసి వెడదాం!" అన్నాను.

"ఒక్క నిమిషం. మీరు వస్తారో రారోనని చెప్పలేదు నేను. పైకి ఒక్కసారి మా ఫ్రెండ్స్‌కు చెప్పివస్తాను. ఏదైనా ఫోన్‌వస్తే డార్మిటరీలో ఉన్నానని చెప్పమని: ఓ.కే?" అంది కామిని.

అడది తల్చుకుంటే అనకట్టల్లాంటి అబద్ధాలు ఎలా కట్టేస్తుందో ఇపుడు తెలుస్తోంది. పథకం కూడా ఎంత సరిగ్గా వేస్తోంది!!

"సరే"నని అక్కడే నిలబడ్డాను.

—కామిని వచ్చింది. స్కూటరు ఎక్కింది. స్కూటర్ కదిలింది.

దారిలో ఆగి భోజనంచేశాము. ఆ తరువాత స్కూటర్ మా గదికి దారితీసింది.

మా వీధిలో కొందరు జనం ఇంకా వీధిదీపాల కళ్ళతో వీధులలోకి చూస్తున్నారు. ఎపుడో ఓ రోజు నేనే ఆ వీధిదీపాలను బద్దలుకొట్టిపారేస్తాను. ఆ తర్వాత నాకు నా గదిచుట్టూ చీకటి, గదిలో సుఖం!

స్కూటర్‌ను కొంచెం దూరంలోనే ఆపి, గదిముందు నిలబెట్టాను. నడుం మీద చెయ్యివేసి కామినిని గదిలోకి తీసుకెళ్ళాను. పక్క సర్దాను. ఫాన్ వేశాను. ఆమెను మంచం దగ్గరికి నడిపించాను. మెల్లిగా మీద చెయ్యి వేయబోతోంటే—

తలుపు తట్టిన చప్పుడయింది.

—ఉలిక్కిపడ్డాను.

ఈ సమయంలో ఇదేమిటి? స్నేహితులెవరూ రారు. చుట్టుపక్కలెవరికీ ఈ యిల్లు తెలీదు! మరెవరు వచ్చింది?

వెళ్ళి తలుపు తీశాను.

ఎవరో పంచెకట్టు పెద్దమనిషి. తప్పు అడ్రస్‌కు వచ్చినట్టున్నాడు. "ఎవరు కావాలి?" అనడిగాను.

నన్ను తోసుకుంటూ లోపలికొచ్చాడు అతను గదిలోకి.

ఆశ్చర్యపోతూ ఉండిపోయాను. అతన్ని చూడగానే కామిని ఉలిక్కిపడింది. తడబడుతూ "మా నాన్న" అంది.

ఈ క్షణంలో కామిని తండ్రి ఇక్కడకు ఎలా వచ్చాడు?—

అర్థం అవుతోంది— అడ్రస్ అడిగి కామిని వలపన్ని వచ్చిందన్నమాట!

"మర్యాదగా మీ దగ్గర ఉండే డబ్బు యిచ్చెయ్యండి, లేకపోతే.... గోలచేసి మిమ్మల్ని బజారుకు లాగుతాను!—"

సూటిగా బిజినెస్‌లోకి వచ్చేశాడు.

క్షణం ఆలోచించాను— ఈ గది ప్రాంతంలో అల్లరి కూడదు. ఈ గది నాకు ప్రాణసమానం. నాకు ఎన్నోసార్లు స్వర్గాలను పంచిన ప్రదేశం ఇది. ఇంత ప్రైవసీ ఉన్న గది వేరేది దొరకటం కష్టం!

డ్రాయర్లో చెయి పెట్టాను— చేతికి గుర్రాల రేసులో నాకు వచ్చిన మొత్తం ప్లస్ నా డబ్బూ తగిలింది. దాదాపు ఐదు వేలు!!

బాధగా బయట పెట్టాను. ఈ జూదంలో ఓడిపోతున్నానని తెలుస్తోంది.

—వేటగాడు పులిని గురిచూసి కొడతాడు. కానీ ఒక్కోసారి గురితప్పి, ఆ పులి ఎదురు దాడిచేస్తుంది. అపుడు వేటగాడే ఓడిపోతాడు. —నేను జూదగాడిని. ఈ సారి నేనే ఓడిపోయాను.

గెలిచిన విజయగర్వంతో కామినీ, ఆమె తండ్రీ మెట్లు దిగుతోంటే.... నేను ఓడిపోతూ తలవంచుకొని కసిగా చూస్తూ నిలబడిపోయాను!!

